

నొప్పి మాయం.. సర్జరీ దూరం

కొంత కాలంగా ఫిజియోథెరపీ వైద్యంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. పక్షవాతం వంటి జబ్బులకు థెరపీ సేవలతో ఆరోగ్య సిరిని సొంతం చేసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. -8లో



సౌత్‌జోన్ మల్టీడే మ్యాచ్ ప్రారంభం

ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం అయ్యాయి. ఆదివారం వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో అనంతపురం- చిత్తూరు జట్లు తలపడ్డాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.227
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 130 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సర్వీసులో స్త్రీ శక్తి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 8వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4నుంచి ప్రారంభమైన పవిత్రోత్సవాలు ముగిశాయి. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పవిత్ర విసర్జనాలు, మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణ తదితర పూజలను అర్చకులు ఆగమోక్తంతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులతోపాటు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి కడపలో సమావేశాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, శ్రీనివాసులురెడ్డి, జిల్లా కోశాధికారి బి లక్ష్మీదేవి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు పాటు కడపలో జరిగే సమావేశాల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. తొలి రోజు కడప నగరంలోని డాక్టర్ అంబేద్కర్ సర్కిల్ నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు.

10న సెమినార్

కడప ఎడ్యుకేషన్: ప్రజా సంఘాల ఐక్యవేదిక సేవ్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ సాయంత్రం యూటీఎఫ్ భవన్‌లో 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - ప్రభుత్వ రంగ సంస్థలు- విద్యా ప్రజారోగ్యం రంగాలపై ప్రభావం' అనే అంశం మీద నిర్వహించనున్న సెమినార్‌ను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌కు ప్రధానవక్తగా రాజ్యసభ ఎంపీ ఆర్. శివధాసన్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కడపలోని పెన్షనర్స్ సంఘం జిల్లా కార్యాలయంలో సెమినార్ కరపత్రాలు, పోస్టర్ ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులకు నియోజకవర్గాల కేటాయింపు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులకు దిగువ పేర్కొన్న అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంట్‌నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరించాలని తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో గురుమోహన్‌కు కడప, మైదుకూరు, కల్లూరు నాగేంద్రారెడ్డికి పులివెందుల, జమ్మలమడుగు, రెడ్యం వెంకట సుబ్బారెడ్డికి కమలాపురం, బద్వేల్, పిపి మధుకు ప్రొద్దుటూరు, డోన్ నియోజకవర్గాలను కేటాయించారు.

- అన్నమయ్య జిల్లాలో పి.రాకేష్‌రెడ్డికి జీడీ నెల్లూరు, తంబళ్లపల్లె, అనీషారెడ్డికి పుంగనూరు, మదనపల్లె, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి పీలేరు, రాయచోటి, పడమటికోన దేవంత్ రెడ్డికి రైల్వేకోడూరు, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయించారు.

అమ్మకానికి ఎర్రబంగారం

ఎర్రచందనం స్మగ్లర్లు శేషాచలం అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన దుంగలను కేంద్రీయ ఎర్రచందనం డిపోలో భద్రపరుస్తారు. వాటికి వేలం పాట నిర్వహించనున్నారు.

- సీఆర్ఎస్ డిపోలో నిల్వలపై దృష్టి
- ప్రస్తుతానికి 135 టన్నులకు వేలం
- ఈనెల 22 నుంచి అక్టోబర్ 6 వరకు వ్యాపారుల సందర్శన





నిల్వ ఉంచి ఎర్రచందనం దుంగలు (ఫైల్)

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం నిల్వ ఉన్న ఎర్రచందనం విక్రయించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో అటవీశాఖ ఎర్రచందనం నిల్వలపై దృష్టి సారించింది. కేంద్రీయ డిపో(తిరుపతి)లో ఉన్న ఎర్రచందనం అమ్మేందుకు అన్ని చర్యలను తీసుకుంది. శేషాచలం అటవీ పరిధిలో ఎక్కడ ఎర్రచందనం లభ్యమైనా సెంట్రల్‌డిపోకు తరలిస్తున్నారు. రాజంపేట, కపిలతీర్థంలో కూడా ఎర్రచందనం డిపోలు ఉన్నాయి. వీటి నిల్వల విషయంలో సీఆర్ఎస్ ప్రధానంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతానికి 135 టన్నులు వేలానికి సిద్ధం చేశారు. ఈ విషయాన్ని సీఆర్ఎస్ సంబంధిత అధికారి ఒకరు ధ్రువీకరించారు. ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనం రాయలసీమ ప్రాంతంలో ఉన్న కొండల్లో మాత్రమే దొరుకుతుంది. ఈ కొండలు దాదాపు 5.5లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లో విస్తరించిన శేషాచలం, వెలుగొండ, పాలకొండ, నల్లమల అడవులు తూర్పు కనుమల్లో ఉన్నాయి. వీటిలో శేషాచలం, వెలుగొండలో మాత్రమే అధికంగా ఎర్రచందనం పెరుగుతోంది. ఈ కొండల్లో యురేనియం, ఐరన్, గ్రాఫైట్, కాల్షియం లాంటివి వివిధ నిష్పత్తుల్లో ఉన్నాయి.

రాజంపేట ఎర్రబంగారానికే డిమాండ్

జీవవైవిధ్యఅటవీ ప్రాంతం(బయోస్పెయిర్)గా గుర్తింపు పొందిన శేషాచలం ఎర్రచందనం చెట్లతో ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. ప్రధానంగా శేషాచలం కొండల్లో పెరిగే ఎర్రచందనం ఎక్కువ చేవ ఉండటంతో దానికి అంతర్జాతీయమార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఇందులో రాజంపేట ఎర్రచందనానికి ఎక్కువ డిమాండ్ ఉంది. వైఎస్సార్‌జిల్లాలో 3.2 మిలియన్సు హెక్టార్లలో, అన్నమయ్య జిల్లాలో 2.8 మిలియన్ల హెక్టార్లలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయి.

డిమాండ్ ఎందుకు..

ఎర్రచందనంతో చేసిన వంట పాత్రలను చైనా, జపాన్‌లో వాడుతుంటారు. అలాగే సంగీత వాయిద్యాలు తయారు చేసి పెళ్లిళ్లలో బహుమతిగా ఇస్తుంటారు. అలాగే సంగీత వాయిద్యాలు తయారు చేసి పెళ్లిళ్లలో బహుమతిగా ఇస్తుంటారు. రష్యా వాళ్లు కూడా ఎర్రచందనం కొనుగోలు చేస్తుంటారు. అందులో ఔషధగుణాలు ఉన్నాయి. వయగ్రా, కాస్మెటిక్, ఫేస్ క్రీమ్ లాంటి వాటిలో వీటిని వాడతారు. అల్సర్‌ను తగ్గించే గుణం, కిడ్నీ సమస్యలు, రక్తాన్ని శుద్ధి చేయడం వంటి లక్షణాలు ఎర్రచందనంలో ఉంటాయని నిపుణులు అంటున్నారు.

- విదేశాలకు తరలిపోకుండా ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాంటీ స్మగ్లర్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది.

శేషాచలం అడవుల్లో నిత్యం కూంబింగ్ చేస్తూ చెట్లను నరకకుండా అడ్డుకుంటోంది. 2015లో ఏర్పాటైన ఈ టాస్క్‌ఫోర్స్‌లో పోలీసు, ఫారెస్టు, ఏపీఎస్పీ, సివిల్ పోలీసు డిపార్టుమెంట్ల సిబ్బంది ఉంటారు. తిరుపతి హెడ్‌క్వార్టర్‌గా పనిచేస్తోంది. గత 15 సంవత్సరాల్లో 15 లక్షల టన్నుల ఎర్రచందనం విదేశాలకు తరలిపోయింది.

- సీఆర్ఎస్ డిపోలోని నిల్వ ఉన్న మూడు రకాల ఎర్రబంగారం వేలంపాటకు సిద్ధమైంది. ఈ-సేల్ ద్వారా అమ్మకాలు సాగించనున్నారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 6 వరకు ఎర్రబంగారు కొనుగోలు దారులు డిపో సందర్శించే అవకాశం కల్పించారు. చిప్స్, బటన్స్, రూట్స్ రకాలను అమ్మకానికి సిద్ధం చేశారు. రేట్ విషయంపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేయనుంది.

అటవీప్రాంతం:	శేషాచలం(బయోస్పెయిర్)
అన్నమయ్య జిల్లా:	2.8 మిలియన్ల హెక్టార్లు
వైఎస్సార్ జిల్లా:	3.2 మిలియన్ల హెక్టార్లు

ఎర్రచందనం అనే పేరు ఎలా..

ఎర్రచందనాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. టిరోకార్పస్‌సాంటలైనస్ అనేది దీని శాస్త్రీయనామం. టెరో అనే గ్రీకు మాటకు ఉడ్(కర్ర) అని అర్థం. కార్పస్ అంటే పండు. దాని కాయ చాలాగట్టిగా ఉంటుంది. సాధారణంగా అది మొలకెత్తదు. అది మొక్క రావాలంటే ఏడాది పడుతుంది. దీనినే ఎర్రచందనం, రక్తచందనం, శాంటాలం. ఎర్రబంగారం అని కూడా అంటారు.

రాజంపేట, రైల్వేకోడూరు పరిధిలో..

రాజంపేట, రైల్వేకోడూరు రేంజ్ పరిధిలో 50 వేల హెక్టారలో శేషాచల అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో అధికంగా ఎర్రచందనం ఉంది. ఈ అడవులను జీవావరణ రిజర్వుగా కేంద్రం ప్రకటించింది. ఐదువేల వృక్షజాతులు మొక్కలు కలిగిన శేషాచల అడవులకు బయోస్పియర్ రిజర్వుగా ప్రకటించారు. ఈ అడవులో 1700పైగా పుష్పించే జాతి మొక్కలు ఉన్నాయి.



దుంగలన్నీ ఒకచోటికి..

స్మగ్లర్ల అక్రమరవాణా నేపథ్యంలో ఎల్లలు దాటిన ఎర్రచందనాన్ని, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్మగ్లర్లు అక్రమంగా నిల్వ చేసిన ఎర్రదుంగలను , అటవీ, పోలీసు,కస్టమ్స్‌శాఖల వద్ద వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎర్రచందనాన్ని ఒకేచోటికి రప్పించి భద్రపరిచే పనులకు నాలుగేళ్ల క్రితం అటవీశాఖ శ్రీకారం చుట్టింది. టెండర్ల ద్వారా విక్రయించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు ఏర్పాట్లు చేసింది. తిరుపతి కేంద్రీయ ఎర్రచందనం డిపోకు జిల్లాలోని డిపోలో నిల్వ ఉంచిన వాటిని తరలిస్తారు. అక్కడే వేలంపాట నిర్వహించనున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

కుటుంబ బంధాలకు స్ఫూర్తి మరియమాత



ఆరోగ్యమాత స్వరూపానికి పూల అలంకరణ చేస్తున్న దృశ్యం

కడప సెవెన్‌రోడ్స్: మరియమాత కుటుంబ బంధాలు ఎలా ఉండాలో తన జీవితం ద్వారా తెలుపుతూ విశ్వాసులకు స్ఫూర్తినిచ్చారని కడప మేత్రాసన కోశాధికారి రెవరెండ్ ఫాదర్ ఎస్. సురేష్ అన్నారు. ఆరోగ్యమాత నవదిన ప్రార్థన ఉత్సవాల సందర్భంగా ఆదివారం మరియాపురంలోని సెయింట్ మేరీస్ క్యాథడ్రల్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ మరియన్న దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరియమాతను ఆరోగ్య వరప్రదాయిని అంటారని, విశ్వాసం, నమ్మకాలతో ఆమె సన్నిధికి వచ్చి ప్రార్థించిన వారికి ఆరోగ్యం, ఉపశమనం లభిస్తాయన్నారు. ఆమె చూపిన బాటలో విశ్వాసులంతా నడిచినపుడే శాంతి సమాధానాలు లభిస్తాయన్నారు.

నగరంలో ఆరోగ్యమాత ఊరేగింపు

అనంతరం ఆరోగ్యమాత తేరు ఊరేగింపు మరియాపురం నుంచి నగరంలోని పలు ప్రముఖ కూడళ్ల ద్వారా ఆరోగ్యమాత పుణ్యక్షేత్రానికి చేరుకుంది. వల్లూరు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ శరత్ ఊరేగింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కడప మేత్రాసన మరియదళ, విన్సెంట్ దె పాల్ సభ్యులు, ఆరోగ్యమాత సభ సిస్టర్లు పాటలు, జపమాల ధ్యానం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు నల్గొండ డాన్‌బాస్కో ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విల్సన్ ఆధ్వర్యంలో పరిశుద్ధ దివ్య సత్ ప్రసాద ఆరాధన,స్తుతి ప్రార్థనలు, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యమాత యువత ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తి గీతాలాపన, నృత్య ప్రదర్శనలు జరిగాయి.

వైభవం..రామయ్య పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఇందులో భాగంగా అర్చకులు శ్రావణ్ కుమార్, పవన్ కుమార్, వీణా రాఘవాచార్యులు భగవత్ విజ్ఞాపనం, లోక కల్యాణం కోసం సంకల్పం చేయించారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామ చంద్రుల ప్రవరలను చదివారు. అగ్ని ప్రతిష్టాపన తర్వాత సీతారాముల తలమీద జీలకర్ర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎ నవీన్ కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గ్రహణం ఎఫెక్ట్.. ఆలయాలు మూసివేత



మూసివేసిన దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం



ఒంటిమిట్ట రామాలయ ప్రధాన గోపుర ద్వారాన్ని మూసివేస్తున్న దృశ్యం



రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ తలుపులు వేస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం కడప నగరంలోని ఆలయాన్నింటిని మూసివేశారు. ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం భారతదేశంలో ఏర్పడింది. ఈ కారణంగా దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం 1.50 గంటలకు మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున ఉదయం 6.00 గంటల నుంచి భక్తులకు స్వామి వారి దర్శనభాగ్యం కలిపించనున్నారు. అలాగే మున్సిపల్ హైస్కూలు వద్దగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం, గడ్డిబజారులోని శ్రీ బాలాజీ ఆలయం, బిల్టప్ వద్దగల శ్రీ విజయదుర్గాదేవి ఆలయం, శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం తోపాటు ఇతర ఆలయాలను కూడా మూసివేశారు.

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయం ఆదివారం మూతపడింది. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా రామాలయాన్ని మధ్యాహ్నం 1:50 గంటలకు మూసివేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున సుప్రభాతసేవ, ఆలయశుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణ, నివేదన అనంతరం యథావిధిగా భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ విజిలెన్స్ అధికారి గంగులయ్య, అర్చకులు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్: చంద్రగ్రహణం సందర్భంగా రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని మూసివేశారు. అలాగే పాత రాయచోటిలోని శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం, చెక్‌పోస్ట్ వద్ద వెలసిన శివాలయాలను మూసివేశారు.

వినూత్న ఆలోచన.. విశిష్ట ఆవిష్కరణ

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల నమోదుకు గడువు పెంపు

మదనపల్లె సిటీ: బుర్రకు పదునుపెట్టి వినూత్న ఆలోచనలతో పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మక ఆలోచనలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ పేరిట ప్రతిపాదనలు ఆహ్వానిస్తోంది విద్యార్థులను ప్రోత్సహించి ఉపకార వేతనాలు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనక్ పేరిట ప్రతిపాదనలు పంపించేందుకు సెప్టెంబర్ 15 వరకు గడువు ఇచ్చింది.

ఏటా నిర్వహణ

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ వారు ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను నిర్వహిస్తున్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ,రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యా సంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాలో 304 ఉన్నత, 162 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. దీని కోసం 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తరగతికి ఒకరు వంతున పాఠశాలకు ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే అవకాశముంది. జిల్లాలో ఇప్పటి వరకు 1120 నామినేషన్లు వచ్చాయి. రాష్ట్రంలోనే జిల్లా ఇప్పటి వరకు మొదటి స్థానంలో ఉంది.





జిల్లా స్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ,అధికారులు (ఫైల్), జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లా విద్యార్థి ప్రశంసాపత్రం అందకుంటున్న దృశ్యం (ఫైల్)

జిల్లా ఇన్‌స్పైర్ మనక్ వివరాలు

2022-23	2023-24	2024-25
జిల్లా స్థాయికి ఎంపికైనవి: 245	నామినేషన్లు: 2700	నామినేషన్లు: 2350
రాష్ట్ర స్థాయికి ఎంపికైనవి: 21	జిల్లా స్థాయికి ఎంపికైనవి: 326	జిల్లా స్థాయికి ఎంపికైవనవి: 246
జాతీయ స్థాయికి ఎంపికైనవి: 2	రాష్ట్ర స్థాయి: జరగాల్సి వుంది	రాష్ట్ర స్థాయి: జరగాల్సి వుంది
	జాతీయస్థాయి: జరగాల్సి వుంది	జాతీయ స్థాయి: జరగాల్సి వుంది

2025-26 ఇప్పటి వరకు 1120 నామినేషన్లు వచ్చాయి.

దరఖాస్తు చేసుకునే విధానం

తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటేషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఐడియా ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, ఆలోచనకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివవరాలు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించి బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబర్, ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపర్చి,సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతను సంబంధించి అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టుల ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15 వతేదీ వరకు గడువు ఉంది.

» ప్రాజెక్టులను పంపండిలా...

www. inspireawards. gov. in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా సెప్టెంబర్ 15 తేదీలోపు పాఠశాల విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషికం అందిస్తారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల వరకు తమ ప్రాజెక్టును మెరుగుపర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్ ,జపాన్ సందర్శన అవకాశాలతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది. పూర్తి వివరాలకు జిల్లా సైన్సు అధికారులను సంప్రదించాలి.

అగ్రస్థానమే లక్ష్యం



గత సంవత్సరం జిల్లా రాష్ట్రంలో మూడోస్థానం నిలిచింది. ఈ ఏడాది అగ్రస్థానమే లక్ష్యంగా 3000 ప్రాజెక్టులు సమర్పించాలని అధికారులు నిర్దేశించారు. ఇది సాధించడానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ నామినేషన్లు సమర్పించాలి. నమోదు వేగవంతం చేయడం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి సరైన వేదికను అందించినట్లు అవుతుంది. -సుబ్రమణ్యం జిల్లా విద్యాశాఖ అధికారి

బాల శాస్త్రవేత్తలను ప్రోత్సహిద్దాం



చిన్న వయస్సులోనే విద్యార్థులను పరిశోధనల వైపు ప్రేరించడానికి ఇన్‌స్పైర్ అవార్డు పథకం ఉపయోగపడుతుంది. గైడ్ టీచర్లకు శిక్షణ ఇచ్చాం. ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేస్తున్నాము. అగ్రస్థానమే లక్ష్యంగా సైన్స్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అందరి సహకారంతో లక్ష్యాన్ని సాధిస్తాం. -మార్ల ఓబుల్‌రెడ్డి,జిల్లా సైన్స్ అధికారి

నొప్పి మాయం.. సర్జరీ దూరం

- ఫిజియోథెరపీ దివ్య ఔషధం
- దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



రాజంపేటలో భవిత కేంద్రం విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్

రాజంపేట టౌన్ : ఇప్పుడు వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలు వివిధ జబ్బుల బారిన పడుతున్నారు. ఇంకా చెప్పాలంటే తల్లి గర్భం నుంచే అనేక మంది అనారోగ్య సమస్యలతో పుడుతున్నారు. నరాలు, కండరాలు, బుద్ధిమాద్యం వంటి సమస్యలు అనేక మందికి పుట్టుకతోనే వస్తున్నాయి. వీటితో పాటు ఒక వయసు వచ్చాక ఏ కారణం చేత అయినా మనిషి మానసిక సమస్యలు, శారీరక నొప్పుల తోపాటు పక్షవాతం తదితర వ్యాధుల బారిన పడతారు. ఇలాంటి వారిని ఆరోగ్యవంతుడిగా చేసేందుకు ఫిజియో థెరపీ ఎంతగానో దోహద పడుతుంది. మర్దనాలు, వ్యాయామాలకు ఆధునిక వైద్య పరికరాలు ఉపయోగించి చికిత్సలు అందించే విధానం ప్రస్తుతం అందుబాటులో ఉంది. కొంత కాలంగా ఫిజియోథెరపీ వైద్యంపై ప్రజల్లో అవగాహన బాగా పెరిగింది. ముఖ్యంగా పక్షవాతం వంటి జబ్బులకు థెరపీ సేవలతో ఆరోగ్య సిరిని సొంతం చేసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిజియో థెరపీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. అలాగే 51 మండలాల్లో ఉన్న భవిత కేంద్రాల్లో అంగవైకల్యం, బుద్ధిమాంద్యం పిల్లలకు ఫిజియోథెరపీ సేవలను వైద్యులు అందిస్తున్నారు. ఇదిలా వుంటే భారతదేశంలో ఫిజియోథెరపీ సేవలు 1951వ సంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చాయి. సెప్టెంబర్ 8న ఫిజియోథెరపీ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తీర్మానించింది. అందువల్ల 1996 నుంచి ఫిజియోథెరపీ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

ఇవీ ప్రయోజనాలు

ఫిజియోథెరపీ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఒక వయసు వచ్చిన వారిని పట్టిపీడించే ప్రధాన సమస్య కండరాలు పట్టేయడం. అలాగే శరీరంలో వివిధ భాగాల్లో తలెత్తే నొప్పుల సమస్య. అయితే ఈ నొప్పులు రెండు రకాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఒకటి మెకానికల్ పెయిన్స్, రెండవది ఫిజికల్ పెయిన్స్. మెకానికల్ పెయిన్స్‌కు ఫిజియోథెరపీ బాగా పని చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. పని చేసేటప్పుడు నొప్పులు ఎక్కువగా ఉండటం, విశ్రాంతి సమయంలో నొప్పులు తక్కువగా ఉంటే దీనిని మెకానికల్ పెయిన్స్‌గా వైద్యులు నిర్ధారించారు. అలాగే విశ్రాంతి సమయంలో నొప్పులు ఎక్కువగా ఉంటే దీనిని ఫిజికల్ పెయిన్‌గా వైద్యులు పేర్కొంటున్నారు. మనిషి నొప్పులను బట్టి వైద్యులు ఫిజియోథెరపీ ప్రారంభిస్తారు. ఇలాంటి నొప్పులకు ఫిజియోథెరపీ దివ్య ఔషధంలా పని చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

నడుం, మోకాళ్ల నొప్పులకు చక్కటి పరిష్కారం

చాలా మందికి ఒక వయసు వచ్చాక నడుము, మోకాళ్ల నొప్పుల సమస్యలు పట్టిపీడిస్తుంటాయి. కొంత మంది ఈ నొప్పులు తట్టుకోలేక ఆపరేషన్లు కూడా చేయించుకుంటారు. అయితే నొప్పులు ప్రారంభమైన వెంటనే ఫిజియోథెరపీ చేయించుకుంటే ఆపరేషన్ అవసరం ఉండదని వైద్యులు చెబుతున్నారు. చిన్నపాటి వ్యాయామాలతో శాశ్వత పరిష్కారం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా ఫిజియోథెరపీ చేయించుకోవచ్చు.

ప్రసవం తరువాత వచ్చే సమస్యలు నయం

మహిళలకు ప్రసవం తరువాత వచ్చే సమస్యలకు ఫిజియోథెరపీ వైద్యం చాలా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ప్రసవం తరువాత నడుం నొప్పి, మెడ నొప్పితో మహిళలు బాధపడుతుంటారు. గర్భం దాల్చినప్పుడు శరీరంలో వచ్చే మార్పులే ఇందుకు ప్రధాన కారణం. అనుభవం ఉన్న థెరపీ వైద్యులతో ఈ సమస్యకు చక్కటి పరిష్కార మార్గం లభిస్తుంది.

పక్షవాతానికి తిరుగులేని వైద్యం

ఫిజియోథెరపీ పక్షవాతానికి తిరుగులేని వైద్యం అని వైద్యులు చెబుతున్నారు. గతంలో పక్షవాతం వస్తే మనిషి మంచానికే పరిమితం అయ్యేవారు. అయితే థెరపీ కారణంగా ఏడాదిలోపే పక్షవాతం వచ్చిన వారు కోలుకొని తమ పనులు చేసుకోగలుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇదిలావుంటే మెదడులో రక్తనాళాలకు రక్తం అందకపోతే నాడి కణజాలం చనిపోయి పక్షవాతానికి దారితీస్తుంది. థెరపీ వ్యాయామాల వల్ల తిరిగి మెదడు తద్వారా కండరాలు పని చేయడం ప్రారంభిస్తాయి.

సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యం



హెల్దీ ఏజింగ్ లక్ష్యంగా వృద్ధులకు ఆయుష్షు పెరగడమే కాక ఆరోగ్యకరమైన జీవనశైలి కల్పించడంలోనూ ఫిజియోథెరపీ ఎంతగానో ఉపయోగపడుతుంది. కొన్ని వ్యాధులకు కనీసం మాత్ర కూడా వేసుకోకుండానే ఫిజియోథెరపీ ద్వారా నయం చేయవచ్చు. జిల్లాలో పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. రోగులు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు పొందవచ్చు. ఫిజియోథెరపీ వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

– డాక్టర్ పి.మహమ్మద్ సమియుల్లాఖాన్, ఫిజియోథెరపిస్టు, ప్రభుత్వ ఆసుపత్రి, జమ్మలమడుగు

మాటల్లో చెప్పలేని ఆనందం



భవిత కేంద్రాలకు వచ్చే అనేక మంది శారీరక, మానసిక దివ్యాంగుల పిల్లలకు కేవలం ఫిజియోథెరపీ ద్వారా వారి సమస్యను చాలా వరకు నయం చేస్తున్నాం. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలు లేచి నిలబడలేరని అనుకున్న వారు కూడా ఉన్నారు. ఫిజియో థెరపీ వల్ల ఇతరుల సాయంతో నడవగలిగే స్థితికి తీసుకొచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. పిల్లలకు బృహత్తరమైన సేవ చేస్తున్నందుకు మాటల్లో చెప్పలేనంత ఆనందం కలుగుతుంది.

–డాక్టర్ రమేష్, ఫిజియో థెరపిస్టు, భవితకేంద్రం, రాజంపేట

క్లుప్తంగా

అత్తపై అల్లుడి దాడి



చికిత్స పొందుతున్న పద్మావతిబాయి

నందలూరు : మండలంలోని లేబాక గ్రామ పంచాయతీ మరాటిపల్లె గ్రామంలో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నరసింహారావు అలియాస్ చిన్న అనే వ్యక్తి మరాటపల్లె గ్రామానికి చెందిన మంజులాబాయిని వివాహం చేసుకున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా భార్య మంజులబాయి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లింది. వెళ్తూ వారిద్దరి పిల్లలను తన తల్లి పద్మావతిబాయి దగ్గర వదిలి వెళ్లింది. తన పిల్లలను తనతో పంపాలని అత్తతో గొడవకు దిగిన అల్లుడు కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

టిప్పర్ ఢీకొని 11 పొట్టేళ్లు మృతి



రోడ్డుపై మృతి చెందిన పొట్టేళ్లు

తంబళ్లపల్లి : టిప్పర్ ఢీకొని 11 పొట్టేళ్లు మృతి చెందిన సంఘటన తంబళ్లపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. తంబళ్లపల్లి మండలం ఎర్రసానిపల్లెకు చెందిన సుధాకర్ ఆదివారం పొట్టేళ్లను మేపడానికి తోలుకెళ్లాడు. అవి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. పొట్టేళ్లు రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయాయి. అక్కడికక్కడే చనిపోయిన వీటిని చూసి బాధితుడు బోరున విలపించాడు. రూ. 2 లక్షల దాకా నష్టం సంభవించిందని, ఆదుకోవాలని ఆయన కోరారు.

బంగారు దుకాణ గుమస్తాపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : బంగారు ఆభరణాలకు సంబంధించి డబ్బు అడిగినందుకు దుకాణ గుమస్తాపై దాడి చేసిన ఘటనలో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న సాబిర్ కొన్నేళ్ల నుంచి బంగారు వ్యాపారం చేస్తున్నాడు. గాంధీరోడ్డుకు చెందిన షేక్ నూర్ అనే వ్యక్తి సాబిర్‌ను బంగారు కావాలని అడిగాడు. పూచీ ఎవరుంటారని సాబిర్ అడగ్గా తన తమ్ముళ్లు షేక్ ఇలియాస్, మహమ్మద్‌రఫీలను తీసుకెళ్లి మాట్లాడించాడు. ఈ క్రమంలో సాబిర్ వద్ద అతను జూన్ 17న 256.950 గ్రాములు, జూలై 3న 195.670 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత బంగారు నగల డబ్బులు ఇవ్వాలని సాబిర్ తన గుమస్తా అయిన ఖాజావలితో అడిగించాడు. అందుకు నూర్ సరిగా సమాధానం ఇవ్వలేదు. ఈ నెల 2న ఖాజావలి ఫోన్ చేసి డబ్బు అడుగగా నూర్ అసభ్యకరంగా మాట్లాడి డబ్బులు ఇచ్చేది లేదని బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతేగాక ఖాజావలి ఇంటికి వెళ్తున్న సమయంలో నూర్ దాడి చేయడంతో గాయాలయ్యాయి. బంగారు నగలు తీసుకొని డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతోపాటు దుకాణ గుమస్తా ఖాజావలిపై దాడి చేశాడని సాబిర్ శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నూర్‌తోపాటు పూచీ పడిన అతని సోదరులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మైలవరం : మండలంలోని ధన్నవాడ గ్రామానికి చెందిన మద్దిరాల చెన్నప్ప (52) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గత 3 ఏళ్లుగా వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులు ఎక్కు కావడం వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌లు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



జిల్లా స్థాయి బాలుర బాల్ బ్యాడ్మింటన్ జట్టుతో నిర్వాహకులు

జమ్మలమడుగు రూరల్ : వైఎస్సార్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా (వైఎస్సార్, అన్నమయ్య) జిల్లా స్థాయి జూనియర్ బాల బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఆదివారం జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపికలను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని మండలాల నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జూనియర్ జిల్లా జట్టుకు బాలురు 10 మందిని, బాలికలు 10 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12, 13, 14వ తేదిల్లో అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెలక్షన్ కన్వీనర్ ఓబయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సెలక్షన్ కమిటీ మెంబర్లు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు
మహమ్మద్‌బాబా (రాజంపేట) కె.కౌశిక్, హైడెన్, డి.రాజేష్, వెంకటేష్, చిన్న ఓబులేసు (దువ్వూరు) డి.షడ్రక్, రఫెల్ (చిన్న సింగనపల్లె) ఎస్.మురళి, రాజు (ఒంటిమిట్ట) ఎస్. షాజిద్(రాజంపేట)

జిల్లా బాలికల జట్టు
డి.కీర్తి, డి.నయోమి (చిన్న సింగనపల్లె) ఎం.స్వీటీ (ఎస్.ఉప్పలపాడు) జి.వర్షిణీ (తాళ్ల ప్రొద్దుటూరు) ఎం.గౌతమి, జి.సునంద, కె.చెర్లీన్, ఎస్.అశ్వినీ, ఎస్.లక్ష్మీ (చియ్యపాడు)

సౌత్‌జోన్ అండర్-23 మల్టీడే మ్యాచ్‌లు ప్రారంభం



చిత్తూరు తేజరెడ్డి, 73 పరుగులు



చిత్తూరు ముఖేష్, 4 వికెట్లు



నెల్లూరు అఖిల్, 5 వికెట్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం అయ్యాయి. ఆదివారం వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో అనంతపురం- చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 64, వికాస్ 53 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని ముఖేష్ చక్కగా అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. రెడ్డి ప్రకాశ్ 2, బాలాజీ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 33 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. ఆ జట్టులోని తేజరెడ్డి 73, రెడ్డి ప్రకాశ్ 20 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో..
కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 43.5 ఓవర్లకు 257 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని భరత్‌రెడ్డి 66, ఎస్ఎండి ఆయూబ్ 51, శివ కేశవ 41 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని అఖిల్ 5, ఇకాక్షర్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 35.5 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. ఆ జట్టులోని సోహన్ వర్మ 53, శ్రీహర్ష 31 పరుగులు చేశారు. కడప జట్టులోని వరుణ్‌తేజ్ రెడ్డి 3 వికెట్లు, చెన్నారెడ్డి 1 వికెట్ తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

లాండ్రీ షాపులో అగ్నిప్రమాదం

మైదుకూరు : లాండ్రీ నిర్వహిస్తున్న ఓ ఇంటిలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు రాజారెడ్డి వీధిలో ఉంటున్న కంచర్ల ఆంజనేయులు నివాసం ఉంటున్న ఇంటిలోనే లాండ్రీ నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం స్విచ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఫ్రిడ్జ్, మోటార్, టీవీ, బియ్యంతోపాటు ఇంట్లో ఉంచిన బంగారు ఆభరణాలు, నగదు, శుభ్రం చేసి ఇస్త్రీ చేసేందుకు తీసుకొచ్చిన పలువురి పట్టుచీరలు, దుస్తులు అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రొద్దుటూరు అగ్నిమాపక కేంద్రం నుంచి అగ్నిమాపక అధికారి, సిబ్బంది సంఘటన జరిగిన ఇంటి వద్దకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆంజనేయులు కోరారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్లు ఇచ్చి, ఆపై ఇంట్లోకి తీసుకెళ్లి రౌడీషీటర్ రాజ్‌కుమార్ లైంగిక దాడికి యత్నించిన ఘటన భగత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో భగత్‌సింగ్ నగర్‌లో ఐదేళ్ల చిన్నారి ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి ఆడుకుంటున్న సమయంలో.. అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ రాజ్‌కుమార్ చాక్లెట్ ఇచ్చి ఎత్తుకొని తన ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే పాప కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. రాజ్ కుమార్ చిన్నారిని తీసుకెళ్లాడని స్థానికులు చెప్పడంతో.. చిన్నారి తల్లి రౌడీషీటర్ ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో బాలిక డ్రెస్‌ను రాజ్‌కుమార్ తొలగిస్తుండగా చూసిన ఆమె గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి అతనికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, కడప తాలూకా సీఐ రెడ్డెప్ప, ఎస్సై తులసి నాగప్రసాద్, తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రౌడీషీటర్ రాజకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం



మృతి చెందిన ఖాదర్ హుస్సేన్

మైదుకూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆదివారం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి బైపాస్‌పై కలసపాడుకు చెందిన వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగి షేక్ ఖాదర్ హుస్సేన్ (52) దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కలసపాడులోని పోలేరమ్మ వీధికి చెందిన ఖాదర్ హుస్సేన్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం బ్యాంక్ పని మీద వెళుతున్నాను అంటూ భార్య ఫాతిమాకు చెప్పి మోటార్ బైక్‌పై బయల్దేరారు. మైదుకూరు శివారులో జాతీయ రహదారి బైపాస్‌పైన ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సంఘటనలో బైక్‌పై ఉన్న ఆయన తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని మైదుకూరు అర్బన్ పోలీసులు పరిశీలించి ఖాదర్ హుస్సేన్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. మృతునికి మొదటి భార్య ద్వారా ఒక కుమారుడు, ఆమె మృతి చెందిన తర్వాత చేసుకున్న రెండో భార్య ఫాతిమాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ప్రొద్దుటూరు క్రైం : ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ సంఘటన ప్రొద్దుటూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చౌడూరు గ్రామానికి చెందిన బత్తల వెంకటేష్ (28) స్నేహితులతో కలిసి సరదాగా పెన్నానదికి వెళ్లాడు. అక్కడ స్నేహితులందరూ కలిసి భోజనం చేశారు. కొంత సేపు వారంతా సరదాగా గడిపారు. ఈ క్రమంలో పెన్నానదిలో ఈత కోసం దిగిన వెంకటేష్ నీళ్లలో గల్లంతయ్యాడు. కొంత సేపు తర్వాత ఊపిరాడకపోవడంతో అతను మృతి చెందాడు. ఎస్ఐ రాజు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

సర్కారు దవాఖానా.. ఓపీ రాసేదెవరన్నా..

- ఇదీ సిద్దవటం ఆస్పత్రి తీరు
- రోగులపై నర్సు ఆగ్రహం



ఆసుపత్రికి వచ్చిన రోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నర్సు

సిద్దవటం : సిద్దవటం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ఓపీ రాసేందుకు కూడా దిక్కులేకుండా పోయింది. పై పెచ్చుగా ఆసుపత్రికి వచ్చిన రోగులపై డ్యూటీ నర్సు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మహిళా డాక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల వైరల్ జ్వరాలు విజృంభించాయి. కుటుంబంలో ఒకరిద్దరికి జ్వరాలు సోకాయి. సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు 250 ఓపీల సంఖ్య ఉందంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల కనీస మర్యాద లేకుండా.. 'ఇవాళ ఆదివారం ఒక డాక్టర్ మాత్రమే ఉంటారని ఓపీ రాయం, బీపీ చూడం, కట్టు కట్టం' అంటూ నర్సు విచక్షణ కోల్పోయి మాట్లాడటం పట్ల రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వేల కోట్లు వెచ్చించి కోట్లాది రూపాయలు ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తుందని, అలాంటిది రోగుల పట్ల నర్సు కనీస మర్యాద లేకుండా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

తప్పిన ప్రమాదం



కంటేవారిపల్లె వద్ద టెర్రకోట స్టాల్‌లోకి దూసుకెళ్లిన కారు

కురబలకోట : కురబలకోట మండలం కంటేవారిపల్లె వద్ద హైవే పక్కనున్న టెర్రకోట కళాకారుడు మనోహర్ ఇంటిలోకి ఆదివారం ఉదయం కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. బాధితుల కథనం మేరకు.. పలమనేరుకు చెందిన నలుగురు యువకులు ఆదివారం హార్సిలీహిల్స్‌కు కారులో బయలుదేరారు. కొంత సేపట్లో హిల్స్ చేరుకోవాల్సి ఉండగా.. సమీపంలోని కంటేవారిపల్లె వద్ద హైవే పక్కన అదుపు తప్పి ఏకంగా టెర్రకోట స్టాల్ ఉన్న ఇంటిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన కలకలం సృష్టించింది. స్థానికులు ఒక్కసారిగా హతాశులయ్యారు. ఏమైందో ఏమోనని కలవరపడ్డారు. దూసుకెళ్లిన కారు ఒక్కసారిగా ఆగిపోయింది. ఊహించని ఈ సంఘటనలో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. టెర్రకోట స్టాల్‌లోని కుండలు, బొమ్మలు నలిగిపోయాయి. రేకుల షెడ్డు ఊడిపడింది. టీవీఎస్ వాహనం, మరో మోటార్ సైకిల్ ధ్వంసమైంది. రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. కుర్రోళ్లు ఆదమరచి డ్రైవింగ్ చేయడంతో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఆ సమయానికి అక్కడ పెద్దలు టెర్రకోట కుండల పనులు చేసుకుంటున్నారు. పిల్లలకు సెలవు కావడంతో ఆడుకుంటున్నారు. ఇద్దరి పిల్లల్ని సెకన్ల ముందే కుటుంబీకులు లోనికి తీసుకెళ్లారు. దీంతో ఎవ్వరూ ఆ సమయంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు ఇంకొంచెం లోనికి వెళ్లి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఆస్తి నష్టం తప్ప ప్రాణ నష్టం లేకపోవడంతో హమ్మయ్యా.. అంటూ అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



ప్రశాంతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్వేలి : మండల పరిధిలోని నేతివారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన దాసరి ప్రశాంతి(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఆదివారం ఉదయం చిట్వేలి పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరుటౌన్ గాంధీ గిరిజన కాలనీకి చెందిన ప్రశాంతికి అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నేతివారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన రాజేష్‌తో తొమ్మిది నెలల క్రితం వివాహం జరిగింది. తరువాత కొన్నాళ్ల నుంచి కుటుంబ కలహాలు మొదలు కావడం, అత్తారింటి వేధింపులు ఎక్కువ కావడంతో అనుమానస్పదంగా మృతి చెందినట్లు మృతురాలి తండ్రి దాసరి రమేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

చిట్వేలి : మండల పరిధిలోని కెకె వడ్డిపల్లికి చెందిన రాయని శాంతమ్మ (34) ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. శాంతమ్మ, మరికొందరు కలిసి ట్రాక్టర్‌లో ఎగువపల్లికి కూలి పనికి వెళ్లి అక్కడ ముగించుకొని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కె కందులవారిపల్లి గ్రామంలోకి వచ్చేసరికి డ్రైవర్ అతి వేగంగా ట్రాక్టర్ నడుపుతుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద అత్యవసరంగా బ్రేక్ వేయడంతో డ్రైవర్ పక్కన కూర్చున్న శాంతమ్మ ట్రాలీకి, ఇంజన్‌కు మధ్యలో పడిపోయింది. ఆమెపై ట్రాలీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కూలీలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతురాలి మరిది రాయని సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేటకు పంపినట్లు పోలీసులు తెలిపారు.